# కట్నం వద్దు - కానీ

''అతను ఒక స్కూల్ టీచర్''

''అతనూ అంటే ఎవరు?''

''అదేకదా నేను చెప్తున్నది, అతనొక హైస్కూలు ఉపాధ్యాయుడు''

''అది కాదయ్యా నేనడిగేది, ఆయనకిక ఊరూ, పేరూ లేవా అని?''

''ఉన్నాయి ఉన్నాయి. ఒక మామూలు మనిషికి ఉండవలసినవన్నీ అతనికీ ఉన్నాయి. ఊరులేకుండా ఎట్లా ఉంటుంది? పై ఆకాశాన్నుండి ఫ్లయింగ్ సాసర్‌లో వచ్చాడా? అతనికి పేరు లేదా అని అసలునీవెట్లా అడిగావు? మనిషిగా పుట్టినవాడికి పేరులేదని చెప్పటానికి నేనేమైనా పిచ్చివాణ్ణా? ప్రస్తుతం అతని ఊరూ, పేరూ గూర్చి చెప్పకపోవటానికి సరైన కారణం ఉంది.''

''ఏమిటా సరైనకారణం?''

''అదేకదా నేను చెప్పపోతున్నది. ఈలోపలే నీవు తుపాకీలా దూరి ప్రశ్నలగుండ్లు పేలుస్తున్నావ్''

''తుపాకీలో దూరటానికి నేనేమైనా చీమనా? దోమనా? నీపద ప్రయోగం మార్చుకో, తుపాకీ బదులు ఫిరంగి అని చెప్పు. ఈ కాలంలో సర్కస్ నైపుణ్యం ఉన్నా లేకపోయినా అన్ని సర్కస్‌లలో ఎవరో ఒకడు ఫిరంగి లోపల దూరి ఫైరింగై బయటకు వస్తాడు.''

''పానకంలో పుడకలా అడ్డుపడుతున్న నీకు కథ చెప్తున్నందుకు నన్నెవరైనా చీపురుతో కొట్టాలి.''

''నీ సూచన చక్కగా ఉంది. అయినా నీకిది మామూలేకదా! ఈదెబ్బలన్నీ నీవు తర్వాత తిను, ముందు కథ ముగించు''

''ముగించాల్సింది నీ కథే. పోరాబయటకు, ఇహనీకు జన్మలో కథ చెప్పను.''

''సారీ బ్రదర్, నీలో కొంచెం వేడిరగిలించటానికే ఇట్లా చేశాను, ఇప్పుడు మన కథలో గూడా కొంచెం కారాన్ని ఎక్కువ చేయొచ్చు''

''ఒరేయి... ఇది కారం, పులుపులు కలిపే కథకాదురా, అసలిది కాథేకాదు, వాస్తవంగా జరిగిన సంఘటనే''

''సరిసరి.. కథ వినాలని ఎంతో ఆరాటంగా ఉంది, చెప్పుచెప్పు... ఆ టీచర్ పేరేమిటి?''

''అయ్యొయ్యొ.. దీనిగూర్చే గదా ఇంత సమయం వృథాఅయింది. రెడ్డొచ్చె మొదలాడు అన్నట్లు మళ్ళీ తగులుకున్నావే!''

''సారీ, సారీ, గుర్తులేక అడిగాను. ఇకమీదట అతని పేరు నీవు చెప్పినా నేను వినను. ప్లీజ్ ప్రొసీడ్''

''అతని పేరు చెప్పక పోవటానికి తగిన కారణమున్నదని నేను చెప్పానుగదా! ఆ కారణమేమిటంటే అతని కొడుకు ప్రస్తుతం. ఐ.పి.యస్. ఆఫీసర్గా ఉన్నాడు''

''ఇది మరీబాగుంది, ఐ.పి.యస్ అయితేమాత్రం. వాళ్ళకి తండ్రి ఉండగూడదనే నియమమేమైనా ఉందా? ఆలిండియా సర్వీసెస్ ప్రవర్తనా నియమావళిలో ఆ అధికార్లకు నామధేయరహిత జనకులే ఉండాలనే ఏదైనా సబ్-క్లాజ్ ఉందా?''

''అదిగో మళ్ళీ కెలకటం ఆరంభించావా? నేను అతని పేరు చెప్పకపోవటానికి కారణం ఆటీచర్ ఎవరో చెప్తే నీవు గుర్తుపడతావ్? ఆ తర్వాత నే చెప్పే విషయాలు ఆ ఐ.పి.యస్. ఆఫీసర్కు తెలిస్తే నా దేహానికి ఏంతిప్పలు వచ్చి పడతాయో నాకే తెలియదు.''

''అయితే నామీద నీకు నమ్మకం లేదన్నమాట, నేనుపోయి నీవు చెప్పిందంతా అతనికి చేరవేస్తాననే గదా నీవు అనుమానించేది?''

''అబ్బా మిత్రమా.. నీపట్ల నాకు నమ్మకంలేదంటూ అన్యాయంగా ఆరోపించకు. నా భార్యమీద నాకెంతవిశ్వాసముందో, అంతకుమించి నీ భార్య మీద, సారీ, నీమీద ఉంది.

అయితే ఒక్క విషయం, నా భార్యనోరు అన్నా, నీ నోరుఅన్నా నాకు విశ్వాసంలేదు. అందువల్ల ఆ టీచర్ పేరు బయటకు వెల్లడి చేయకుండా నేనింకా ముందుకు వెళ్ళాలో వద్దో నీవే తీర్మానించి చెప్పు.''

''తీర్మానించటానికేముంది? నీవు కథను కొనసాగించు, చేతిలో కొచ్చిన పండుచాలు, చెట్టుజాతకం నాకెందుకు?''

''అట్లారా ద్దారికి? ఆ తండ్రీ కొడుకుల పేరేగాదు, ఈ కథలో ఏ పాత్ర పేరూ నేను బయట పెట్టను. అంతేకాదు, రాష్ట్రంలో ఈ ఐ.పి. యస్. ఆఫీసర్ ఏ ప్రాంతంలో పనిచేసే విషయంగూడా నేను చెప్పను.''

''ఓకె.. ఓకె... ప్రోసీడ్''

''మన కథలోని టీచర్ ఉత్తముడనీ, మంచి ఆశయాలు కలవాడనీ సాధారణ ప్రజానీకం భావిస్తున్నారు. తను పనిచేస్తున్న గ్రామంలోకి ఆనాడు బ్రహ్మచారిగా ఒక్కడే వచ్చాడు. కొంతకాలం గడిచింతర్వాత ఒక మధ్య తరగతి కుటుంబంలోని అమ్మాయితో పరిచయం ఏర్పడి ఆమెనే వివాహం చేసుకొన్నాడు. అంతవరకూ అద్దెఇంటిలో ఉంటున్న అతను వివాహానంతరం అత్తగారి చిన్న ఇంటిలోకి మకాం మార్చాడు. అతని భార్యకు తల్లితప్ప వేరే బంధువులెవరూ లేరు. ఆ అమ్మాయి తండ్రి మిలిట్రీలో పనిజేసేవాడట! 1965 సం.లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అతను ప్రాణం కోల్పోయాడట కొద్దిగా పొలం, ఇంటిస్థలం ఆ కుటుంబానికి ఉన్న ఆస్తి. భర్తృహీన అయిన ఆతల్లికి వచ్చేకుటుంబ పింఛన్‌తో కాలంగడిచిపోతూ ఉంది. పెండ్లి అయిన రెండు సంవత్సరాలకు ఆ టీచర్ దంపతులకు ఈ ఐ.పి. యస్. కుర్రాడు జన్మించాడు.

''మాతృ గర్భంలోనే పద్మవ్యూహం గూర్చి సగం నేర్చుకొని బయటపడ్డ అభిమన్యుని మాదిరే ఇతనుగూడా తల్లి ఉదరంలోనే ఐ.పి. యస్ పరీక్షవ్రాసి వెలుపలికి రాగానే ఇంటర్వ్యూకు వెళ్ళాడనా నీవు చెప్పేది?''

''నేనట్లా ఏం చెప్పలేదు. ఈ కథలో నేను ప్రత్యేకించి పేర్లుఏవీ పేర్కొనటం లేదుగాబట్టి, పాత్రలకు ఉపాధ్యాయుడనీ, గురుపత్నిఅనీ, ఐ.పి. యస్ వ్యక్తిఅనీ సంకేతనామాలివ్వక తప్పదు. మరికొన్ని పాత్రల్ని గూడా ప్రవేశబెట్ట బోతున్నాను. వాటి గూర్చిగూడా నీవిట్లా ప్రశ్నించటం ప్రారంభిస్తే, ఏకారణం చెప్పకుండానే నేను కథను ముగింపు చేస్తాను. నేను కోరేది నీ చెవులుమాత్రమే. నీనోరు అదేపనిగా పనిచేస్తూ ఉంటే దానిలో ఏ చూయింగ్ గమ్మో, వక్కపొడో కూరుకుని కూర్చో.''

''నేను నోటికి టేపొకటి అంటించుకొంటానులే, కానీ ఒక చిన్న ప్రశ్న, ఈ పెళ్ళి ఎప్పుడు జరిగిందో అదొక్కటి మాత్రం చెప్పగలవా?''

''దాని కభ్యంతరం లేదు. 1967లో ఆ టీచర్ పెళ్ళి, 1969లో ఆ ఐ.పి.యస్ జననం. ఆ అబ్బాయికి అయిదేళ్ళ వయసప్పుడు, అంటే 1974లో ఏదో రుగ్మత చేసి అతని అమ్మమ్మ మృతి చెందింది. ఆటీచర్‌గారి సహధర్మచారిణి - ఆమె గూడా ఎస్.ఎస్.ఎల్.సి చదివింది గాబట్టి, ఆ దంపతులు కొడుకును ఎంతో శ్రద్ధతో చదివించటం జరిగింది. అన్ని తరగతుల్లోనూ అతని దే ప్రథమస్థానం. పంతులమ్మకు, కొడుకును ఒక డాక్టర్‌ను చేయాలని కోరిక. పంతులుగారి ఉద్దేశ్యం మాత్రం అతన్ని ఒక ఇంజనీయర్నో, లెక్చరర్‌నో చేయాలని. కానీ చక్కగా చదువుతున్న ఆ ఐ.పి.యస్ అబ్బాయి మనసంతా భాషాధ్యయనం మీదే ఉండేది. ఇంగ్లీషు, హిందీ రెండు భాషల్లో అతను మంచి ప్రావీణ్యం సంపాదించాడు. ఈ రెండు భాషల్లో అతను కథలు, కవితలు వ్రాసి కాలేజీ మాగజైన్స్‌లో ప్రచురింప జేయటంగూడా జరిగింది. ఇంగ్లీషు ఎం.ఏ. పూర్తిచేసిన వెంటనే అతను ఆలిండియా సర్వీసెస్ పరీక్షవ్రాసి, ఒక మంచి ర్యాంక్‌తో ఐ.పి.యస్‌కు ఎంపికయ్యాడు. తుది ఫలితం రావటంతో ఆ ఇంట్లో సంబరం మొదలైంది. ఆనందంతో పొంగిపోయిన ఆ తండ్రి భార్యను, కొడుకును తీసుకొని పుణ్యక్షేత్రాలు సందర్శించి ఈ జన్మ, గత జన్మరుణాల్ని కృతజ్ఞతా హృదయంతోనూ, ఆనంత భాష్పాభిషేకంతోనూ తీర్చుకోవటం జరిగింది. ఆ ఉపాధ్యాయుడికి స్కూల్లోనూ, బయటా ఒకేసారి ప్రమోషన్ లభించినట్లైంది. సహోపాధ్యాయులు, హెడ్‌మాస్టర్ ఒక 'డి.ఇ.వో'ను చూసినంత గౌరవంగా అతణ్ణి చూడసాగారు. అతనితో వ్యవహరించేటప్పుడు ఊరివాళ్ళవైఖరిలో గూడా ఆశ్చర్యకరమైన మార్పు కనబడింది. తండ్రి ఏనుగుమీద కూర్చొంటే కొడుకు పృష్ఠభాగం మొద్దు బారుతుందీ అన్న సామెతగా, తనయుడు ఐ.పి.యస్ అయితే జనకునికి అహంభావం ఉండదుగానీ, ప్రజల అతివినయ ప్రవర్తన అతన్నావిధంగా మత్తిల్లజేయవచ్చునేమో! కానీ టీచర్ మాత్రం ఎంతో ఆత్మసంయమనాన్ని పాటిస్తూ ఎటువంటి అతిశయానికి ఆస్కారమివ్వలేదు.

ఆ ఐ.పి.యస్ అబ్బాయి శిక్షణకోసం ముసూరికి వెళ్ళేముందు బంధుత్వాలను గుర్తుచేసుకొంటూ, మిత్రత్వాలను నటిస్తూ ఎందరో ఆకుటుంబాన్ని విందులకు ఆహ్వానించటం జరిగింది. మరికొందరు ఆ అబ్బాయి రూపసౌకుమార్యంగూర్చి, శక్తి సామర్థ్యాలగూర్చి, సద్గుణ సంపత్తి గూర్చి కీర్తించటానికి మాత్రమే ఆ తండ్రిచుట్టూ చేరేవారు. ఇంకొందరు ఈ డొంకతిరుగుడు మార్గాలకు పోకుండా సరాసరి తమ కుమార్తెల

వివాహ ప్రస్తావనను తీసుకురావటం జరిగింది. అబ్బాయి శిక్షణ అదంతా పూర్తియ్యేసరికి రెండున్నర సంవత్సరాలు పడుతుందని, వివాహ విషయం ఆతర్వాతనేనని ఆ అబ్బాయి తండ్రి ఆ ఐ.పి.యస్ వేటగాళ్ళతో సవినయంగా మనవిచేశాడు. అబ్బాయి ట్రైనింగ్‌కు వెళ్ళిన తర్వాత ఈ సంబంధ సందర్శకుల సంఖ్య క్రమేపీతగ్గి, దాదాపు ఆరేడు నెలలతర్వాత పూర్తిగా ఆగిపోయింది. ఐ.పి.యస్ శిక్షణ పూర్తై ఎ.ఎస్.పి.గా ఆ అబ్బాయి ఉద్యోగంలో చేరినతర్వాత మళ్ళీ పెళ్ళి సంబంధ తరంగాలు ఆ ఉపాధ్యాయుని పాదప్రక్షాళణం చేయటం ప్రారంభించాయి. ఈతఫా అమ్మాయిల తల్లిదండ్రులు, పెళ్ళిళ్ళ పేరయ్యలు చాలాగట్టి ప్రయత్నాలు చేయటం కొనసాగించారు. ఉపాధ్యాయుడు వివాహ ప్రస్తావనచేసినప్పుడు అబ్బాయినుండి ఎటువంటి అభ్యంతరం రాలేదు. అందువల్ల ఆ శుభకార్యాన్ని ఇహ ఎటువంటి ఆలస్యం జరగకుండా నెరవేర్చాలని ఉపాధ్యాయుడు ఆయన సతీమణి నిర్ణయించుకొన్నారు. గొప్ప గొప్ప సంబంధాలు వచ్చినా ఉపాధ్యాయునికి జోతిష్యంలోగట్టి విశ్వాసం ఉన్నందువల్ల వధూవరుల జాతకాలు సవ్యంగా సరిపడకుండా ఒక్క అడుగు ముందుకు వేయటానికైనా కూడా ఆయన సిద్ధపడలేదు. ఆ అబ్బాయికి సరిపోయిన యోగ్యమైన వధువులు ఎందరో లభ్యమైనా, అతని జాతకానికి సరిపడే తరుణీ జాతకాలు మాత్రం చాలా స్వల్పంగా వచ్చినై. ఆ వచ్చిన సంబంధాల జాతకాలన్నింటిని పరిశీలించి శ్రేష్టమైన తొమ్మిది పదింటితో సంక్షిప్తంగా ఒక జాబితాను సిద్ధం చేశాడు. ఆ ఉపాధ్యాయుడు ఈ జాబితానుకూడా మరింత సూక్ష్మంగా జల్లెడపట్టి మూడు నాలుగు జాతకాలను ఆయన ఎంపిక చేయటం జరిగింది.

''వింటున్నావా! లేక కళ్ళుతెరిచే నిద్రబోతున్నావా? బోరుగాఉందా?''

''నాకు బోరేంకొట్టలేదుగాని, రెండు విషయాల గూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఒక టేమిటంటే ఆ ఐ.పి.యస్ ఆఫీసర్‌ని నేనే అయితే ఎంత బాగుండేది? నాన్నగారు చూసే పెళ్ళి సంబంధాలు సుందరాంగుల గృహాలకు వెళ్ళి, కావాల్సినంతగా ఫలహారాలు సేవించి, వాళ్ళతో హాయిగా సరస సల్లాపాలు ఆడుకోవచ్చుగదా! అన్నియోగ్యతలూ ఉన్న బ్రహ్మచారిగా నన్ను ఎవరైనా తమగృహాలకు ఆప్యాయంగా ఆహ్వానించే వారు. ఎందరెందరో సుకుమార రాకుమార్తెల నయనాల తళతళలుగా నేను మారి ఉండేవాణ్ణి. ఊర్వశి, మేనక, రంభ, తిలోత్తమవంటి భామినుల దివా స్వప్నాలలో నేను నాయకుణ్ణి అయి ఉండేవాడిని!''

''ఒరేయి ఒరేయి ముందు నీ పగటికలలు ఆపరా, నీ వయస్సు ఏభై దాటిందన్న విషయం వదిలేయి. నీవు తాతావైరెండు సంవత్సరాలైందన్న విషయం మర్చిపోతే ఎట్లారా?''

''అందుకేనేను గతానికి పరుగుపెట్టే కలల్ని కంటున్నాను. కనీసం భావనల్లోనైనా నేనొక అదృష్ట బ్రహ్మచారిని కాలేనా?''

''నీ భార్య, పద్మావతీ అమ్మమ్మకు ఈ విషయం తెలిస్తే నీ బ్రతుకేమవుతుందీ? సరే, నీవాలోచించే ఆ రెండో విషయమేమిటి?''

''ఆ తండ్రి అంత సీరియస్‌గా పెండ్లి సంబంధాలు చూస్తున్న తరుణంలోనే ఈ ఏ.ఎస్.పి. ఒక ఐ.ఎ.యస్ అమ్మాయితో ఎదైనా ప్రేమ వ్యవహారంలో పడితే నీకథకు బలే మలుపువచ్చేదే? లేదా సినిమాల్లో చూపిస్తున్నట్లుగా మానవతకూ, స్నేహతత్వానికీ మూర్తీభావమైన ఈ ఐ.పి.యస్. యువకుడు, పతితో ధ్ధరణాలయంలో కాలంవెళ్ళదీస్తున్న ఒక అభాగ్యురాలికి నూతన జీవితాన్ని ప్రసాదించటానికి ముందుకువస్తే, ఆదర్శ జీవుడైన ఆ గురునాధుడు ఒక తిరోగమన వాదిగా మారిపోతాడా?.. అంటే విలన్‌రూపం ధరిస్తాడా అనేదీ నేను ఆలోచిస్తున్న రెండో విషయం''

''ఒరేయి, ఒరేయి నీవిట్లా ఆలోచిస్తూ నీ బుర్రబద్దలు కొట్టుకోకు. పితృవాక్య పరిపాలకుడైన ఆ దాశరధికన్నా మర్యాదాపురుషోత్తముడే మన యువనాయకుడు. తండ్రి అభిప్రాయానికి వ్యతిరేకంగా అతను ప్రవర్తిస్తాడని కలలోగూడా అనుకోవద్దు''

''అయితే పరిపాలనా విషయంలోగూడా ఆ ఏ.ఎస్.పికి ఇహ ఎటువంటి సమస్యా ఉండదు, ఆ తండ్రే అన్ని విషయాలూ చూసుకొంటాడు, సబ్-ఇన్స్‌పెక్టర్లు, ఇన్స్‌పెక్టర్లు రోజూ బడికి వెళ్ళి ఆ ఉపాధ్యాయునికే శాల్యూట్‌లు చేస్తేచాలన్నమాట.''

''ఒరే మూర్ఖుడా... ఆ ఏ.ఎస్.పి ఉద్యోగం చేసేది ఎక్కడ? స్కూలు ప్రక్కనున్న కిల్లీకొట్టులోనా? అతన్ని ఏ ప్రాంతంలో నియమించిందీ నేను నీకు తెలయజేయలేదే, సరే, ఇప్పుడు చెప్తావిను, తండ్రి పనిచేసే ప్రదేశానికి కొన్నివందల కిలోమీటర్ల దూరంలో ఆ ఏ.ఎస్.పి ఇప్పుడు పనిచేస్తున్నాడు.''

''అంటే, ఈ పెళ్ళి సంబంధాలూ, పెళ్ళి చూపులు అన్నీ అతను లేకుండానే జరిగిపోతున్నాయా?''

''ఇందులో నీకింకా సందేహమా? ఈ విషయంలో అబ్బాయి, తండ్రికి బ్లాంక్‌చెక్ ఎప్పుడో ఇచ్చేశాడు.''

''ఆ తండ్రిదిహ మహర్దశే''

''ఇక్కడ మహర్దశ అనచెప్పటానికేముంది? కొడుక్కి గొప్పగొప్ప సంబంధాలు రావటం ఏ తండ్రికైనా గర్వకారణమే, ఇక్కడ అబ్బాయికి ఇంత పెద్ద ఉద్యోగం లేదనుకో, ఇటువంటి సంబంధాలు ఎట్లావస్తాయి? ఇట్లా చూస్తే ఇది ఆ తండ్రికి మహర్దశ అని చెప్పటంలో తప్పులేదులే''

''సరే, ఇంతకీ ఆ అబ్బాయి పెళ్ళి అయిపోయిందా?''

''దాని గూర్చే గదా నేచెప్తున్నది. ఆ ఉపాధ్యాయునికి రెండు సంబంధాలు బాగా నచ్చినై, అందులోనూ పట్ట భద్రురాలైన, ఏకైక సంతానమైన, రూపవంతురాలైన గల్ఫ్ అమ్మాయి సంబంధం మరీమరీ నచ్చింది. ఆ అమ్మాయి తండ్రిచాలా కాలం గల్ఫ్‌లో ఉండి కోట్లు గడించాడు, ప్రస్తుతం ఈ ఊళ్ళోనే స్థిరపడ్డాడు. ఆ పిల్ల బి.ఏ. ఇక్కడే చదివింది. తండ్రి అప్పుడప్పుడు గల్ఫ్‌కు వెళ్ళి వస్తుంటాడు. తన స్వంత ఊళ్ళో ఆయన నిర్మించినటువంటి బంగ్లా ఈ చుట్టుపక్కల ఊళ్ళల్లో మరెక్కడా లేదు. రాజప్రసాదంవంటి ఆ భవనాన్ని చూసిన ఉపాధ్యాయుని నేత్రాలు కొన్ని క్షణాలు నిర్నిమేషంగా ఉండిపోయినై. ఈ సంబంధం ఒక పెళ్ళిళ్ళ పేరయ్య కుదిర్చాడు. ఉపాధ్యాయుడు ఆ గల్ఫుడిని రెండు మూడుసార్లు కల్సుకోవటం జరిగింది. అమ్మాయి అబ్బాయిలు పరస్పరం చూసుకోకపోయినా ఒకరిఫోటో మరొకరు చూసుకొని ఇష్టపడటంతో ఈ సంబంధం దాదాపు నిశ్చయమైనట్లే అన్పించింది. ఈదశలో ఉపాధ్యాయుడూ, గల్ఫుడి మధ్యనాలుగో సమావేశం జరిగింది. ఆ సమావేశంలో జరిగిందేమిటో యధాతధంగా నీకు వివరించే ప్రయత్నించేస్తాను.

గల్ఫుడి ఆతిథిమర్యాదలన్నీ స్వీకరించి ఊరివిషయాలు, ఇంటి విషయాలు ముచ్చటించిన తర్వాత వెళ్ళిపోవటానికి సిద్ధమైనాడు ఉపాధ్యాయుడు. ఎంతో మొహమాటపడుతూ రెండు విషయాలు మాట్లాడాలని గల్ఫుడితో అన్నాడు అతడు. కట్నం తీసుకొనే విషయంలో ఎంత విముఖతఉన్నా, ఈ వచ్చిన సంబంధాలను బేరీజు వేసుకొన్నప్పుడు కనీసం మనసులోనైనా ఏది ఎక్కడ ప్రయోజనకరమో అన్న విషయాన్ని ఆలోచించకుండా ఉండలేకపోయాడు. గల్ఫుడిని ఆస్తికి వారసురాలుగా ఒక్కగానొక్క అమ్మాయి ఉన్నందువల్ల అతడు ప్రత్యేకించి కట్నకానుకల విషయం ఏమీ ప్రస్తావించలేదు. అయినాగూడా తన ఐ.పి.యస్. కొడుకు ఉజ్వల భవిష్యత్తు కోసం ఆ పిల్ల పేరుమీద ఆస్తిపాస్తులు ఎంతఉన్నాయో కనీసం తెల్సుకోవాలన్న ఆరాటం ఆ ఉపాధ్యాయుడికి కల్గింది. ''రెండు విషయాల గూర్చి కొద్దిగా తెల్సుకోవాలనుంది, అడగటం అపరాధమైతే మన్నించండి'' తటపటాయిస్తూ గల్ఫుడితో అన్నాడు. ఏదో పాన్‌మసాలా ప్రకటనా ఫిలింలో పెళ్ళివిషయంలో మరొక్క విషయం అడగటం మర్చిపోయాను, అని షమ్మికపూర్ అన్నప్పుడు అశోక్ కుమార్ దంపతుల ముఖాల్లో ప్రదర్శితమైన ఆందోళనా ఛాయలేవీ ఈ గల్ఫుడి ముఖంలో కన్పించలేదు.

''ఎందుకండీ అంతగా వెనుకాముందాడతారు? మీ మనసులో ఏ సందేహమున్నా అడగండి'' అంటూ గల్ఫుడు మందస్మితం చేస్తూ అడగ్గా ఉపాధ్యాయుడి గుండెదడ కొద్దిగా తగ్గింది.

''ఈ ఇల్లు అమ్మాయి పేరుమీదనే ఉందికదూ - ఉండాలనికాదు. ఊరికే.. తెల్సుకోవాలనే అడుగుతున్నాను'' చదువులు వంట బట్టక ఆత్మవిశ్వాసం కోల్పోయిన విద్యార్థి ప్రశ్నించినట్లుగా అడిగాడు ఉపాధ్యాయుడు. తాను ఎన్నోసార్లు దాటిన సముద్ర అగాధమంత గుంభనమైన నవ్వునవ్వాడు గల్బుడు.

''సరే.. ఇది మీ మొదటి ప్రశ్న. ఇహ రెండోది ఏమిటో గూడా చెప్తే ఒకేసారి సమాధానం చెప్తాను'' ఆ గురువుకు గురువుగా ప్రశ్నించాడు గల్బుడు. ఉపాధ్యాయుని నొసలు ముడుచుకొన్నాయి. తప్పుకోవటానికి వీలులేని అవస్థను జీవితంలో మొదటిసారి ఎదుర్కొంటున్నట్లుగా భావించాడు. నా మొదటి ప్రశ్నకే సమాధానమీయటానికి ఆయనకు అభ్యంతరమేముంది? ఇహ నా రెండో ప్రశ్నకు అతని ప్రతిక్రియ ఏవిధంగా ఉంటుందో మరి? భగవంతుడా ! ఇప్పుడు ఆ రెండో ప్రశ్నను అడకుండా ఉండటానిగ్గూడా లేదు. కానీ ఈరెండో ప్రశ్నను ఏవిధంగా ఇతనికి తెలియజేయాలి! లేని ధైర్యాన్నంతా కూడదీసుకొని ఊపిరి ఆడనంత దైన్యస్వరంతో అన్నాడు ఉపాధ్యాయుడు.

''ఇది నాకు సంబంధించిన ప్రశ్నకాదు, నా భార్యకు మాత్రం, ఈ విషయం గూర్చి తెల్సుకోవాలని పెద్ద ఆసక్తిఉంది. కలలోగూడా ఆవస్తువును పెద్దపరిమాణంలో చూసే అవకాశం నా భార్యకు కలగలేదుగాబట్టి, కనీసం తన కోడలివద్దనైనా అది ఎంత మొత్తంలో ఉంటుందో తెల్సుకోవాలన్న ఉత్సుకత ఆమెది. ఎన్నోసార్లు ఆమెకునచ్చ చెప్పాను, ఇది అడిగే విషయం కాదనీ, వివాహం అయింతర్వాత నీ కళ్ళతోనే నీవు చూడవచ్చుగదా అని. కానీ ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా తెల్సుకోవాలన్నదే ఆమె ఆరాటం. తెల్సుకోవటం ఎందుకంటారా? తెల్సుకొని పులకరించి పోవటానికి. ఈ విషయాన్ని ఆడవాళ్ళు వాళ్ళకువాళ్ళు ప్రశ్నించుకొంటే తప్పులేదు, నాకు మాత్రం మనస్కరించటంలేదు. ఆమె ఆరాటంలో గూడా అనౌచిత్యమేదీ లేదనీ భావిస్తున్నాను. మానవుల్లో వివిధ రకాలు. కొందరికి ఎంతో ఇష్టమైన వస్తువులపట్ల మరికొందరికి అసలు ఆసక్తే ఉండదు. చాలామంది ఎంతో విలువైనదని భావించే వస్తువును కొనటం, నిరుపయోగమైన పెట్టుబడిగా తలపోస్తారు ఇంకొందరు ....''

''అయ్యో, అసలు విషయం ఇంతవరకు చెప్పలేదే? చెప్పదల్చుకొన్నదేదో సాఫీగా చెప్పండి'' 'కన్ఫ్యూషియస్' నవ్వుతోఅన్నాడు గల్బుడు.

ఈమాటతో ఉపాధ్యాయునికి కొంత ధైర్యమొచ్చింది.

''నేను అడగదల్చుకొన్నది బంగారంగూర్చే. కోడలికి ఒంటినిండా బంగారం నగలుండాలన్నదే నా భార్య అభిలాష. ఈ కాలంలోని కొందరు అమ్మాయిలు

బంగారమంటేనే విముఖత్వం చూపుతారన్నదే ఆవిడ భయం. కొందరు అమ్మాయిలకు వెండి ఆభరణాలను, అదీనల్లని వెండితో చేసినవాటిని ధరించాలన్న ఉబలాటం ఉంటుంది, వాటిని చూస్తే అవి పురావస్తువస్తు ప్రదర్శనశాలనుండి తెచ్చినవో నన్పిస్తుంది. మరికొందరమ్మాయిలకు మెడలో అసలు ఏవీ ధరించాలని ఉండదు. ఇంకొందరు ముత్యాలతోగానీ, చౌకబారు పూసలతోగానీ చేసిన గొలుసుల్ని వేసుకోవాలనుకుంటారు. నా శ్రీమతి మదినిండా ఉన్నకోరిక ఏమిటంటే తనకోడలికి కనీసంవందతులాల బంగారు ఆభరణాలైనా ఉండాలని'' చెప్పవలసిన ఈనాలుగు మాటలూ చెప్పి ఆ ఉపాధ్యాయుడు తృప్తిగా శ్వాసపీల్చాడు. ఆనిమిషంలో అతని గుండెల్లో పేరుకొనిపోయిన బరువంతా దిగిపోయినట్లుగా ఫీలైనాడు.

గల్బుడి ముఖంపై అగాధమైన చిరునవ్వు మళ్ళీ దర్శనమిచ్చింది. అతని కంటి కొలుకుల్లోనూ, అధరాల కొనల్లోనూ కథకళి నృత్యనిపుణులు ప్రదర్శించే ప్రత్యేక భావం లాస్యం చేసింది.

''ఇహమీ మొదటి ప్రశ్నకు సమాధానం చెప్తున్నాను, ఈ ఇల్లు మా అమ్మాయి పేరుమీదకాక, నా భార్య పేరుమీద ఉంది. తనుపుట్టి పెరిగిన ఊళ్ళో ఒక మంచి ఇల్లు కట్టుకోవాలని నా భార్య కెప్పటినుండో కోరిక ఉండేది. తను జీవించి ఉన్నంతకాలం ఈ ఇంట్లో ఉండాలన్నదే ఆమె అభిలాష. మా తర్వాత అమ్మాయేకదా ఈ ఇంటికివారసురాలు? అంటే, మేం జీవించి ఉన్నంతకాలం అమ్మాయికి వేరే ఇల్లు అవసరంలేదని గాదు ఉద్దేశ్యం. ఆమె ఇష్టపడ్డట్లుగా స్విమ్మింగ్ పూల్, టెన్నిస్ కోర్టుతో సహా ఈ ఇంటికి రెట్టింపు ఉండే ఒకపెద్ద భవనాన్ని కట్టించబోతున్నాం. ఇహ మీ రెండో ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో నాకూ తెలియటంలేదు. మా అమ్మాయికి మూడొందల తులాల బంగారం ఆభారణాలు ఇప్పటికే ఉన్నాయి. వివాహ సమయంలో అవసరమైతే మరికొన్ని నూతన ఆభరణాలు చేయించటానికి నేను సిద్ధంగానే ఉన్నాను. ఆమె మా ఏకైక సంతానం, మా ఆస్తిపాస్తులన్నీ ఆమెకే కదా చెందేది?

మీ రెండు ప్రశ్నలకు మీకు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోయాను. ఈ ఇల్లు ప్రస్తుతం అమ్మాయిపేరు మీద మార్చటం ఆమెకీ ఇష్టంకాదు. నా శ్రీమతికి గూడా ఇట్లాచేయటం నచ్చదేమో! అందుకే ఆపని ఇప్పుడు చేయటం వీలుకాదు.

మీ రెండో ప్రశ్నకుకూడా నే నిచ్చిన సమాధానం మీకు తృప్తిని కల్గించి ఉండదు. ఒకవేళ నా జవాబు మీకు ఆమోదయోగ్యంగా ఉన్నా, మీ ప్రశ్నమాత్రం నాకు నచ్చలేదు. మీకూ మీ భార్యకు కావాల్సింది వందతులాల బంగారమే. మరి, అధికంగా ఉన్న

రెండొందలు లేదా మూడొందల తులాల బంగారాన్ని నేనేంజేయాలి? అరేబియా సముద్రంలోనో, బంగాళాఖాతంలోనో, హిందూమహా సముద్రంలోనో పారేయాలా? పెండ్లికి ముందు చాలా విషయాలు అడిగి తెల్సుకోవటం మంచిదే, కాని కొన్ని విషయాలను అడగకుండా, చెప్పకుండా ఉండటమే శ్రేష్ఠం. మీ అంచనాలకు తగ్గస్థాయికి నేను ఎదగలేనందుకు చాలా విచారిస్తున్నాను. మీకూ మీ శ్రీమతికి అన్నివిధాలా నచ్చిన ఒక కోడలు తప్పక లభిస్తుంది. ఇంతటి సమర్థుడైన కొడుకును కన్న తల్లిదండ్రులకు ఎటువంటి నిరాశా కలగదు. అన్ని విధాలుగా మీకు నచ్చిన కోడలు లభించాలని ఆదైవాన్ని నేను ప్రార్థిస్తున్నాను. ప్రస్తుతానికి మనం సెలవు తీసుకొందాం. మీరు నాపట్ల చూపిన అభిమానానికి కృతజ్ఞతలు, గుడ్‌బై.'' అని చెప్తూ ఆ గల్పుడు లేచి నిలబడి నమస్కారం పెట్టాడు. ఊహించని ఈ పరిణామానికి నివ్వెరపోయిన ఉపాధ్యాయుడు అసంకల్పితంగా తనూ ప్రతి నమస్కారం చేశాడు. ప్రపంచమంతా తన కళ్ళ ముందే తిరుగుతున్న అనుభూతి కల్గిందతనికి. ఏదో మాట్లాడాలని అన్పించినా, ఇంటిలోపలికి వెళ్ళిపోతున్న ఆగల్పుడిని వెనక్కి పిలవటానికి ధైర్యం చాలలేదతనికి.

''ఊ... ఎట్లా ఉంది నా కథ?''

''కానీ, కథ పూర్తి చేయలేదుగా? ఐ.పి.యస్. అబ్బాయి పెళ్ళి ఇంకా కాలేదా? ఏ అమ్మాయిని చేసుకొన్నాడు? మరి ఆగల్పుడి అమ్మాయి ఎవర్ని పెండ్లాడింది?''

''ఆ ఉపాధ్యాయుడిలా నీవూ రెండు ప్రశ్నలడుగుతున్నావు. సరే, జవాబులు చెప్తా విను. ఐ.పి.యస్ అబ్బాయి పెండ్లి సంబంధాలకు వచ్చిన కరువేదీలేదు. మరోరెండు నెలలకు ఆ ఐ.పి.యస్. అబ్బాయి పెళ్ళి ఒక మనీబాగ్‌తో ఘనంగా జరిగింది. ఇక నీ రెండో ప్రశ్న. ఆ గల్పుడి కూతురు ఎవర్ని చేసుకొందన్నదే కదా? దానికి జవాబు చెప్పాలంటే నన్ను మాత్రంకాదు. ప్రాణ స్నేహితుడా... నా కటువంటి కోరిక లేదని కాదు..... ఏభైఅయిదు సంవత్సరాల వయసుకలిగి ఒక భార్య ముగ్గురు పిల్లలున్ననాకు ఎవరైనా ధనం, రూపం ఉన్న అటువంటి చిన్న అమ్మాయిని ఇస్తారా? నీవేమీ బాధపడకు, త్వరలోనే నేను గల్ఫుకు వెళ్ళి ఒక అందాల చిన్నారి లక్ష్మిని నిక్కాహ్‌చేసుకొని వచ్చినప్పుడు నీవు సంతోషిస్తావుకదా!

---